ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- 32వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం




ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను వృద్ధురాలికి అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, తరిగొండలో ప్రజాసమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా స్థానిక ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 32వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలను సంక్షేమ బుక్‌లెట్ చదివి వినిపించారు. స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ కాలనీలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. దీంతో తక్షణమే సమస్యలు పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ ఏఈ స్నేహప్రియను ఆదేశించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్హులైన వారికి పథకాలు నేరుగా ఇంటి వద్దకే వలంటీర్, సచివాలయ సిబ్బంది ద్వారా అందుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడా గమనించాలన్నారు. సంక్షేమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అసత్యప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెపుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, రామిశెట్టిశివయ్య, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, చందూరెడ్డి, శీలంరమేష్, కరమల హేమంత్‌రాజు, బావాజాన్, చరణ్, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, కోఆప్షన్ మెంబర్ శారదారెడ్డి, వైస్ ఎంపీపీ నందినితాజ్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: గడప గడపకు ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొంటూ పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మండలంలోని తరిగొండ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో సచివాలయం, రైతుభరోసా, విలేజ్ క్లీనిక్ భవనాలు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గర చేశారన్నారు. అర్హులైన తమకు వైఎస్సార్ ఇళ్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బీసీ కాలనీలో ఏడాదిన్నరగా విద్యుత్ స్తంభం నిరుయోగంగా పడి ఉందని ప్రజలు ఫిర్యాదు చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ వరప్రసాద్‌ను ఆదేశించారు. బీసీ కాలనీ మురుగునీటి కాలువలు నిర్మించాలని మహిళలు కోరారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామిని ఎమ్మెల్యే ఆదేశించారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేసుకొన్నా ఇంతవరకు ఇవ్వలేదని రైతులు ఫిర్యాదు చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ ఖాజాబీని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సభ్యుడు ముక్తియార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటశివారెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీ రమణ, మాజీ ఎంపీపీ జమిర్ ఆలీఖాన్, సింగిల్‌విండొ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో డీసీఓ విచారణ

బి.కొత్తకోట: బి.కొత్తకోట సమీపంలోని జీఎంసీ బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో శుక్రవారం సాయంత్రం గురుకులాల సమన్వయ అధికారి వెంకటరావు విచారణ జరిపారు. గురువారం మధ్యాహ్నం 30 మంది ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు గోడ దూకి పరారైన సంగతి తెలిసిందే. వీరిని ఆర్డీఓ, డీఎస్పీలు గురువారం రాత్రి విచారించి పరిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకొన్నారు. దీనిపై వెంకటరావు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. తరగతి గదిలో విద్యార్థులతో సమావేశమైన ఆయన ఒక్కొక్కరి నుంచి వివరాలను సేకరించారు.

ఫోన్ బెదిరింపులపై కేసు నమోదు

మదనపల్లె : చంపుతామని ఫోన్‌లో బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ కొత్త ఇండ్లుకు చెందిన సుధారాణి, బాలప్రసాద్ భార్యాభర్తలు. గత కొన్నిరోజులుగా వీరిమధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. ఈక్రమంలో బాలప్రసాద్ మరో మహిళతో సహజీవనం చేస్తూ భార్య సుధారాణితో తరచూ గొడవపడుతున్నాడు. దీంతో ఆమె తన పుట్టినిల్లు కర్నాటకకు వెళ్లిపోయింది. అయితే గొడవల్లో భాగంగా బాలప్రసాద్ అతడి కుటుంబ సభ్యులు ఇటీవల సుధారాణికి ఫోన్‌చేసి చంపుతామని బెదిరించారు. బాధితురాలు ఫోన్ కాల్ వాయిస్‌రికార్డ్ చేసి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో భర్త బాలప్రసాద్‌తో పాటు మరో 10మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

పెద్దతిప్పసముద్రం : స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ఏడు వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు.

బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



నియామక పత్రం అందుకుంటున్న బత్తులు శ్రీనివాసులు

పీలేరు : బీసీ సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడిగా నియోజకవర్గంలోని కేవీపల్లె మండలంకు చెందిన బత్తులు శ్రీనివాసులు నియమితులయ్యారు. శుక్రవారం బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సి. మల్లికార్జున చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ నాయకుడు కృష్ణయ్య బీసీ కోసం చేస్తున్న పోరాటంలో పాల్గొని, పార్లమెంట్‌లో 50 శాతం రిజర్వేషన్ కోసం పోరాడాలని కోరారు. కార్యక్రమంలో బీసీం సంఘం నియోజకవర్గం అధ్యక్షులు వినోద్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు

కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పెండ్లిపెంటలో ఆదిగంగమ్మ అమ్మవారి ఆలయాన్ని కొత్తగా నిర్మించారు. గ్రామానికి చెందిన మంగివారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం సాయంత్రం యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, కలిశస్థాపన, గణపతి పూజ, వాస్తుహోమం, నవగ్రహ ఆరాధన, హోమాలు, తీర్థప్రసాద వినియోగం ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఉంటుందదని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అచ్చుయంత్రం సృష్టికర్తకు నివాళి



జోహన్స్ గుటెన్ బర్గ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న క్రైస్తవులు

వాల్మీకిపురం : అచ్చుయంత్రం సృష్టికర్త జోహన్స్ గుటెన్‌బర్గ్ వర్థంతి సందర్భంగా స్థానిక ఫింగాణీ ఫ్యాక్టరీ ప్రాంతంలో గుటెన్ బర్గ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు ప్రభుచరణ్ ప్రపంచంలో అచ్చుయంత్రాన్ని కనుగొన్న తరువాత ముద్రించబడిన మొట్టమొదటి గ్రంథం బైబిల్ అన్నారు. అచ్చుయంత్రం ద్వారా గుటెన్ బర్గ్ 300 బైబిల్ గ్రంథాలు ముద్రించగా అందులో 40 బైబిల్ గ్రంథాలు ప్రపంచంలోని పలు ప్రసిద్ధి గ్రంథాలయాల్లో, మ్యూజియంలలో భద్రపరిచారన్నారు. కార్యక్రమంలో శేఖర్, మధు, బాలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా వైస్ ఎంపీపీ ఎన్నిక



శ్రీకాంత్‌కు వైస్ ఎంపీపీ నియామక ప్రతాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

కలికిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రత్యేక సమావేశంలో మండల పరిషత్ రెండవ ఉపాధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటమునినాయుడు తెలిపారు. ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులలో గుట్టపాళెం ఎంపీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌కు మెజారిటీ సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఎన్నికల అధికారి రెండవ వైస్ ఎంపీపీ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహాన్, ఎంపీడీఓ గంగయ్య, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ఎంపీటీసీ సభ్యులు అల్లాబక్షు, రమణ ప్రతీప్‌రెడ్డి(బాబు), సావిత్రి, భారతి, రవీంద్ర నాథరెడ్డి, షాహీన, మండల కన్వీనర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఏఎస్ఐ రమణ తెలిపారు. నీరుగట్టువారిపల్లె పాత ఊరు పుల్లారెడ్డివీధికి చెందిన రెడ్డిలక్ష్మి, మంగమ్మ అక్రమంగా సారా విక్రయిస్తుండగా వారిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

టీబీ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా పౌష్టికాహారం



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

పీలేరు రూరల్ : టీబీ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేయడానికి వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న పలువురు దాతలు ముందుకు వచ్చారు. శుక్రవారం ప్రధానమంత్రి ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా 18 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన సాయిలీల నర్సింగ్ అధినేత డాక్టర్ రవిశంకర్‌రెడ్డి, మాధవి ఆసుపత్రి అధినేత లక్ష్మీకాంత్‌రెడ్డి, ఝాన్సీ ఆస్పత్రి అధినేత దినేష్‌కుమార్‌రెడ్డి తోపాటు పీలేరు టీబీ యూనిట్‌కు చెందిన ఆరోగ్య సిబ్బంది సూపర్‌వైజర్ మోహన్, పవన్‌కుమార్, ధనలక్ష్మి, మునికుమారి, ఉపాధ్యాయిని హేమలత, సీహెచ్‌వో జయలక్ష్మి, హెచ్ఈ ఉషా, సూపర్‌వైజర్ విజయలక్ష్మి పౌష్టికాహారం అందించడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. పీలేరు టీబీ యూనిట్ పరిధిలో మొత్తం 116 మంది టీబీ వ్యాధి గ్రస్తులు ఉండగా అందులో ఇప్పటి వరకు 70 మందికి పౌష్టికాహారం అందించినట్లు చెప్పారు.

నీటి సమస్యపై మహిళల ఆందోళన



నీటి సమస్యపై ఎంపీపీ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న కె.బాటవారిపల్లె మహిళలు

కలకడ : గ్రామంలో మంచినీరు పుష్కలంగా ఉన్నా 40 రోజులుగా ఇళ్లకు నీరు అందకుండా చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కి చెందిన గ్రామస్తులు ఖాళీ బిందెలతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీపీ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ స్కీం బోరులో మంచినీరు ఉన్నా కేవలం రెండు కుటుంబాలకే పరిమితం అవుతున్నట్లు తెలిపారు. సమస్యపై పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి, వారం రోజుల క్రితం ఎంపీడీఓ వచ్చి హామీ ఇచ్చినా నీరు మాత్రం అందడం లేదని వాపోయారు. స్పందించిన ఎంపీపీ శ్రీదేవి రెండు రోజుల్లో అన్ని వీధులకు మంచినీరు అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

వైద్యసేవల్లో బి.కొత్తకోట, పీలేరు టాప్



ఔషధ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చంద్రశేఖర్

-డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్

బి.కొత్తకోట: జిల్లాలో వైద్యసేవలు అందించడంలో బి.కొత్తకోట, పీలేరు ఆస్పత్రులు మొదటి స్థానంలో ఉన్నాయని జిల్లా వైద్యశాలల సేవల సమన్వయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సీహెచ్‌సీని తనిఖీచేసి రోగులకు అందుతున్న సేవలు, ఆస్పత్రి భవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మూడు ఏరియా, ఒక జిల్లా, ఏడు సామాజిక ఆరోగ్య వైద్య కేంద్రాలు వైద్య విధాన పరిషత్ పరిధిలో నడుస్తున్నాయని చెప్పారు. వీటిలో సీహెచ్‌సీల్లో బి.కొత్తకోట, ఏరియా ఆస్పత్రుల్లో పీలేరు రోగులకు సేవలు అందించడంలో ముందున్నాయని చెప్పారు. మదనపల్లెజిల్లా ఆస్పత్రి స్థాయిని 150 పడకల నుంచి 330 పడకల స్థాయికి, బి.కొత్తకోట సీహెచ్‌సీని 30 పడకల స్థాయి నుంచి 50 పడకల స్థాయికి పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. బి.కొత్తకోట, తంబళ్లపల్లె సీహెచ్‌సీల్లో శవ పరీక్ష కేంద్రాలను ప్రారంభించేందుకు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన అవసరమైన భవనాన్ని పరిశీలించామన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు విరివిగా రాయితీలు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు

కలికిరి: రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీఓ)లకు విరివిగా రాయితీలిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు తెలిపారు. శుక్రవారం కలికిరి-2 రైతు భరోసా కేంద్రంలో కలికిరి, చింతపర్తి, వాల్మీకిపురం రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్డ్ రూర్, కలెక్షన్ కేంద్రాలకు రాయితీలు ఉన్నాయని, వీటిలో కోల్డ్ రూము యూనిట్ విలువ రూ.30లక్షలకు గాను 75శాతం, కలెక్షన్ కేంద్రం యూనిట్ విలువ రూ.15లక్షలకు గాను రూ.11.25లక్షలు రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. హెచ్ఓ లక్ష్మీప్రసన్న, ఎఫ్‌పీఓ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన



కుష్టు నివారణపై అవగాహన ర్యాలీ

పీలేరు : స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధి కావచ్చునని హెచ్ఈ కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గూడరేవుపల్లెలో స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి, వయస్సు, లింగ భేదం లేకుండా ఎవరికైనా కుష్టు వచ్చే అవకాశం ఉందన్నారు. బహుళ ఔషధ చికిత్సతో కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. ప్రాథమిక స్థాయిలో వ్యాధిని కనుగొంటే సులభంగా నివారించవచ్చునని తెలిపారు. వైద్య సిబ్బంది పౌజియాబేగం, వెంకటసుబ్బమ్మ, పేమున్నీసా పాల్గొన్నారు.

కలకడ : కుష్టు నివారణపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. శుక్రవారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని దిగువపాళ్యెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శలేకపోవడం, చర్మంపై రాగిరంగు కలిగిన మచ్చలు, స్పర్శ కోల్పోవడంవంటి లక్షణాలను కలిగి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, కుమార్‌రాజా, ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సిబ్బంది లక్ష్మి, హైమావతి, నరసమ్మ, సుశీలభాయ్, రామలక్ష్మి, రమేష్, రోజ, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రియల్టర్లపై కేసు

మదనపల్లె : రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో ఏర్పడిన వివాదాల్లో భాగంగా దౌర్జన్యానికి పాల్పడ్డ ముగ్గురు రియల్టర్‌లపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె మండలం పొన్నూటిపాళ్యంకు చెందిన మధుసూధన్‌రెడ్డి కర్నాటకలోని మరో ముగ్గురితో కలిసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వ్యాపారలావాదేవీల్లో వీరిమధ్య వివాదం ఏర్పడింది. గొడవలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలో గురువారం రాత్రి నిందితులు మంజునాథ్, అతడి స్నేహితులు శరవణ, కృపాకరన్ తనపై దౌర్జన్యం చేశారని మధుసూధన్‌రెడ్డి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

10న బసినికొండ దర్గా ఉరుసు ఉత్సవాలు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం బసినికొండ దర్గా ఉరుసు ఉత్సవాల పోస్టర్లను శుక్రవారం దర్గా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 10న బాబా జెండా ఆవిష్కరణ, 11న గంధోత్సవం, 12న ఉరుసు ఉత్సవం, ఖవ్వాలి ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉరుసు ఉత్సవాలకు భక్తులు పాల్గొనాలని కోరారు. ఉరుసుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు జాకీర్, రియాజ్, ఇమ్రాన్, రఫీ, బాబా శిష్యులు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్ మృతికి సంతాపం

మదనపల్లె సిటీ: కళాతపస్వి, ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్ మృతికి స్థానిక బెంగళూరు రోడ్డులోని మదనపల్లె రచయితల సంఘం కార్యాలయంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఆయన ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. దర్శకులు విశ్వనాథ్ మృతి తీరని లోటని మరసం గౌరవ అధ్యక్షులు త్యాగమూర్తిశర్మ తెలిపారు. తెలుగు సంస్కృతికి, భారతీయ కళలకు తన సినిమాల ద్వారా గుర్తింపు తెచ్చారన్నారు. కార్యక్రమంలో మరసం అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి యుగంధరాచారి, సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

తంబళ్లపల్లె: పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈవో త్యాగరాజు తెలిపారు. శుక్రవారం దాదంవడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పిల్లల అభ్యసన స్థాయిని తెలుసుకుని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట టీచర్ మెహరూన్, సీఆర్‌పీ సుధాకర్ ఉన్నారు.

జగన్మోహిని అవతారంలో జనార్దనస్వామి



రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్దనస్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామివారు జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధన అర్చకులు పార్థసారధిభట్టర్ , కులశేఖర్‌భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజలసేవ , తోమాల సేవ నిర్వహించారు.

మైనార్టీల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఇక్బాల్ అహ్మద్

కలికిరి: రాష్ట్రంలో ముస్లి మైనారిటీల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత లభిస్తోందని మైనార్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మర్రికుంటపల్లి గ్రామం కొత్తగజ్జలవారిపల్లిలో ముస్లిం మైనారిటీలతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. ఇప్పటికే గ్రామంలో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు తదితర అభివృద్ధి పనులకు ఎంపీ ల్యాడ్స్, మండల పరిషత్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంకా అవసరమైన అభివృద్ధి పనులు తమ దృష్టికి తీసుకువస్తే ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు శివాజీ, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, బావాజీ, ఉస్మాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిహామీకి భారీకోత



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప

– 7న కేంద్ర కార్యాలయాల ఎదుట నిరసన

మదనపల్లె : కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి రూ.29,400 కోట్లు కోతపెట్టడాన్ని నిరసిస్తూ ఈనెల 7న జిల్లా వ్యాప్తంగా కేంద్ర కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుకృష్ణప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీపై నిర్లక్ష్యానికి నిరసనగా బీఎస్ఎన్ఎల్, పోస్టాఫీసు, ఆకాశవాణి కార్యాలయాల ముందు ఆందోళనలు చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంతో పాటు ఆహారభద్రతకు లోటు ఏర్పడేలా నిధులు తగ్గించడం, పేదలకు ఉపయోగపడే సబ్సిడీలన్నింటిపై 30 శాతం కోతపెట్టడం ద్వారా పేదలను కేంద్ర ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. ఆహారభద్రతకు భరోసా ఇవ్వలేకపోయారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రస్తావన లేదని తెలిపారు. ఉపాధిహామీ చట్టానికి రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాల్సిందేనని, ఆహారభద్రత కల్పించాలని, సబ్సిడీలలో కోతలు, అధిక ధరల అదుపునకు డిమాండ్ చేస్తూ జరిగే ఆందోళనల్లో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మికసంఘ నాయకులు కే.అనసూయ, శోభ, నిర్మల, మునస్వామి, నవీన్, గౌరమ్మలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు



రామసముద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

రామసముద్రం: రైతులకు ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని మదనపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు దీక్షాకుమారి, వాయుల్పాడు ఏడీఏ వాణిశ్రీ దుకాణదారులను హెచ్చరించారు. శుక్రవారం వారు రామసముద్రం, చెంబకూరులోని ఎరువులు, మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెంబకూరులో ప్రభాకర సాయి శ్రీనివాస ఎరువుల దుకాణాల్లో ఓఫారాలు లైసెన్సుల్లో జమకాకుండా ఉన్న రూ.3.65 లక్షల విలువ చేసే 11.500 టన్నుల ఎరువులను అమ్మకం చేయరాదని నోటీసులు జారీ చేశారు. అలాగే ఎంఆర్‌పి ధరలకే ఎరువులు, మందులు విక్రయించాలన్నారు. కొనుగోలు చేసే ప్రతి రైతు వద్ద వేలిముద్రలు తీసుకొని వారికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అన్ని దుకాణాల వద్ద స్టాక్ వివరాలను ప్రతి రోజు నోటిసు బోర్డుపై నమోదు చేయాలన్నారు. వాటి వెంట ఏవోలు మోహన్‌కుమార్, చంద్రకళ, కృష్ణవేణి ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదు

గుర్రంకొండ: అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని ఏడీఏ శివశంకర్ అన్నారు. శుక్రవారం గుర్రంకొండలో పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో స్టాకు, పంపిణీ రిజిష్టర్లను పరిశీలించారు. గోడౌన్లలో నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణం ఎదుట తప్పనిసరిగా ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించి తప్పని సరిగా రసీదులు ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన మందులు, ఎరువులు విక్రయించ వద్దని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో ఏఈవో అనిత, వీహెచ్ఏ శిరిషలు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి



వసతిగృహ అధికారులతో సమీక్షిస్తున్న డీఎస్‌డబ్ల్యూఓ జాకీర్‌హుస్సేన్

మదనపల్లె సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలో వసతి గృహ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జాకీర్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం మదనపల్లెలో డివిజన్ పరిధిలోని వసతిగృహసంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వసతిగృహ అధికారులు, సిబ్బంది తప్పకుండా ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. అనంతరం వసతిగృహాలను తనిఖీ చేశారు. 8వతరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీరాములునాయక్, వసతిగృహ అధికారులు పాల్గొన్నారు.

వేగంగా అన్నదాన శాశ్వత భవన నిర్మాణ పనులు

వాల్మీకిపురం: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సాయినారాయణ సేవా నిత్య అన్నదాన పథకానికి శాశ్వత భవనాలను ఏర్పాటు చేస్తున్నారు. సాయి నారాయణ సేవా ట్రస్టు. అధ్యక్షులు, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రెండు సంవత్సరాలుగా నిత్యం అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు 300 నుంచి 400 మందికి నిరుపేదలకు, ఆసుపత్రి రోగులకు, వృద్ధులకు నిత్యం ఉచితంగా భోజన వసతి కల్పిస్తున్నారు. పట్టణానికి చెందిత దాత రూ.2కోట్లు విలువ చేసే స్థలం ఉచితంగా ఇచ్చారు. దాతల సహకారంతో రూ.60 లక్షలకు పైగా నిధులు వెచ్చించి అన్నదాన భవనాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం నాటికి భవన నిర్మాణ పైకప్పు పనులు పూర్తి చేశారు.